సాక్షి
ప్రకాశం
ఆదివారం । 25 । మే । 2025



హైవే.. డెత్‌వే!
అమరావతి–అనంతపురం హైవే తరచూ రోడ్డు ప్రమాదాలతో రక్తమోడుతోంది. ప్రయాణికుల పాలిట మృత్యు రహదారిగా మారుతోంది. - 8లో..



మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణం
అమరావతి–అనంతపురం హైవేపై కొమరోలు మండలంలో శుక్రవారం ఆరుగురు మృతిచెందిన రోడ్డు ప్రమాదానికి మితిమీరిన వేగమే కారణమని పోలీసులు వెల్లడించారు. - 8లో..

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
37.7 /28
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

యోగాపై విస్తృతంగా అవగాహన కల్పించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



యోగా చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ, మేయర్, కమిషనర్, తదితరులు

ఒంగోలు సబర్బన్: యోగాంధ్ర–2025 మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలో 10 లక్షల మందికి యోగా సాధనపై అవగాహన కల్పించేలా జిల్లావ్యాప్తంగా విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఒంగోలులోని ప్రకాశం భవనం ఎదురుగా శనివారం ఉదయం ఏర్పాటు చేసిన యోగా రోడ్డులో కలెక్టర్‌తో పాటు జేసీ ఆర్.గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, ఒంగోలు నగర మేయర్ జి.సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21న విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకోనున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో 5 లక్షల మంది ప్రజలు పాల్గొనే విధంగా ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా యోగా మాసం జరుపుకుంటున్నామన్నారు. అందులో భాగంగా జిల్లాలో 10 లక్షల మందికి యోగా సాధనపై అవగాహన కల్పించే కార్యక్రమానికి రూపకల్పన చేశామని కలెక్టర్ వివరించారు. రోజుకో కార్యక్రమంతో యోగాపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రధాన మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో ఒక రోడ్డును యోగా రోడ్డుగా ప్రకటించి ఆ రోడ్డులో ప్రతిరోజూ ఉదయం యోగాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ యోగా సాధన చేసేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ యోగాను జీవన విధానంగా అలవర్చుకోవాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ శాఖ సిబ్బంది, యోగా సాధకులు పాల్గొన్నారు.

పాత భవనాల తొలగింపునకు 28న వేలం పాట

నాగులుప్పలపాడు: మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలో ఏపీ గురుకుల పాఠశాలలో శిథిలమైన భవనాలు తొలగించేందుకు ఈ నెల 28వ తేదీ వేలం పాట నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.మాధవి తెలిపారు. ఆసక్తిగలవారు రూ.10 వేల ధరావత్తుతో పాటు రూ.3,540 ప్రవేశ రుసుంను డీడీ రూపంలో ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా పాఠశాలలో అందజేయాలని సూచించారు. అనంతరం ఈ నెల 28వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 87126 25043 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పొగాకు రైతులకు గడ్డుకాలం



టంగుటూరు మండలం జమ్ములపాలెం గ్రామానికి చెందిన కె.కోటేశ్వరరావు 20 సంవత్సరాలకుపైగా పొగాకు పంట సాగుచేస్తున్నాడు. గత నాలుగు సంవత్సరాలుగా ఎకరా పొలంలో పొగాకు సాగుచేయడానికి ఖర్చులు రూ.1.40 లక్షలయ్యేవి. పంట విక్రయించగా, ఆ ఖర్చులుపోను లాభాలు చూసేవాడు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పొగాకు కంపెనీలు కుమ్మక్కై ధరలు దిగజారుస్తున్న సమయంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి పొగాకు రైతులను ఆదుకోవడంతో మూడేళ్లుగా కోటేశ్వరరావు లాభాలు పొందుతూ వచ్చాడు. ఈ ఏడాది పొగాకు సాగుకు ఎకరాకు పొలం కౌలు, కూలి ఖర్చులు, బ్యారన్ కౌలు, తదితరాలన్నీ కలుపుకుని రూ.1.80 లక్షలకుపైనే ఖర్చయింది. దీనికితోడు దిగుబడులు కూడా 30 శాతం తగ్గాయి. వేలం కేంద్రాల్లో పలుకుతున్న ధరలకు లాభాల సంగతి దేవుడెరుగు.. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని కోటేశ్వరరావు ఆందోళన చెందుతున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పొగాకు రైతులు పలు రకాలుగా నిరసనలు తెలుపుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదని వాపోతున్నాడు. ప్రస్తుతం పొగాకు రైతులకు గడ్డుకాలం దాపురించిందని, ఏం చేయాలో దిక్కుతోచడం లేదని అంటున్నాడు.

- నాలుగేళ్లుగా వచ్చిన పొగాకు ధరలు నేడు కనుమరుగు
- మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి రైతులకు అండగా నిలిచిన గత వైఎస్సార్ సీపీ సర్కార్
- ప్రస్తుతం 40 శాతానికిపైగా పొగాకు బేళ్ల తిరస్కరణ
- బయ్యర్లు సిండికేట్ అయినా చోద్యం చూస్తున్న పొగాకు బోర్డు
- రైతుల కష్టాలు పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఒక్కో బ్యారన్‌కు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల నష్టమంటూ రైతుల ఆందోళన
- గతేడాది గుల్లాకుకు వచ్చిన ధర నేడు గ్రేడ్–1 ఆకుకు రాని వైనం
- నష్టాల ఊబిలో కూరుకుపోతున్న పొగాకు రైతు





ధర లేక దిగాలుగా ఉన్న పొగాకు రైతు

కొరగాని ధర.. కూటమి పొగ!

మార్కెట్ మాయాజాలంలో చిక్కుకుని పొగాకు రైతు దగాపడ్డాడు. నాలుగేళ్లుగా లాభాలు చవిచూసిన రైతు పరిస్థితి నేడు తిరగబడింది. గత ధరలను ప్రస్తుత ధరలతో పోల్చుకుంటూ రైతులు ఘొల్లుమంటున్నారు. గతేడాది ఆల్ టైమ్ గరిష్ట ధర రూ.366గా నమోదైంది. ఈ ఏడాది 65 రోజులు గడుస్తున్నా నాణ్యమైన పొగాకు ధర రూ.280 దాటడం లేదు. వ్యాపారులు, దళారులు కుమ్మక్కవడం, బోర్డు అధికారులు చోద్యం చూస్తుండటంతో కనీస గిట్టుబాటు ధరలు లభించక రైతులు విలవిల్లాడుతున్నారు. వేలం కేంద్రాల్లో రైతుల నుంచి అరకొరగా కొనుగోలు చేయడం, తడిగా ఉందంటూ, నాణ్యత లేదంటూ సాకులు చెప్పి వెనక్కు పంపడం చేస్తున్నారు. వేలం కేంద్రాలకు వచ్చిన సరుకులో 40 శాతం వెనక్కి పంపిస్తుండడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: పొగాకు వేలం కేంద్రాల్లో ఈ ఏడాది ఆరంభ ధరలు చూసి రైతు సంబరపడ్డాడు. గతేడాదిలాగే ఈసారి కూడా లాభాలు మూటగట్టుకోవచ్చని ఆశపడ్డాడు. అయితే, తాజా పరిస్థితులు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. నాలుగేళ్ల లాభాలు చూసిన రైతు నేడు నష్టాల ఊబిలో కూరుకుపోయే దుస్థితి నెలకొంది. ప్రకాశం రీజియన్ పరిధిలోని 11 వేలం కేంద్రాల్లో సుమారు 30 వేల మంది రైతులు పొగాకు సాగుచేస్తున్నారు. పొగాకు బోర్డు ఈ ఏడాది 68,500 హెక్టార్లలో సాగుకు అనుమతివ్వగా పరిమితికి మించి 88 వేల హెక్టార్లలో సాగుచేశారు. బోర్డు అనుమతిచ్చిన పంట ఉత్పత్తి పరిమాణం సుమారు 105.27 మిలియన్ కిలోలు ఉండగా, పంట ఉత్పత్తి అంచనా సుమారు 162 మిలియన్ కిలోలుగా నిర్ణయించారు. రీజియన్ పరిధిలో మార్చి 10వ తేదీ పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. తొలి రోజు కిలో ధర అత్యధికంగా రూ.280, అత్యల్పంగా రూ.278 పలికింది. రానున్న రోజుల్లో మంచి ధరలు పలికి ఈసారి ఖర్చులు పెరిగినా గట్టెక్కొచ్చని భావించారు. కొనుగోళ్లు ఊపందుకుంటున్నాయన్న తరుణంలో పరిస్థితి తలకిందులైంది. ధరలు తగ్గిపోవడం, వేలం కేంద్రాలకు వస్తున్న పొగాకు బ్యారన్లలో 40 శాతం వెనక్కిపోతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. దళారులు, బయ్యర్లు కుమ్మక్కయ్యారు. నాణ్యత పేరుతో దొంగాట మొదలెట్టారు. వేలం కేంద్రాలకు వచ్చిన వాటిలో 10 శాతం బేళ్లకు మాత్రమే అత్యధిక రేటు.. అంటే రూ.280 చెల్లిస్తూ మిగతా వాటిని వారికిష్టమొచ్చిన రేటుకు తీసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా బోర్డు అధికారులు పట్టించుకోవడం మానేశారు. దీంతో తెచ్చిన సరుకును వెనక్కి తీసుకెళ్లలేక కొంత మంది రైతులు వచ్చిన రేటుకే తెగనమ్ముకుంటున్నారు. మరికొంత మంది ఆర్థిక భారమైనా కోల్డ్ స్టోరేజీలకు తరలిస్తున్నారు. మమ్మల్ని ఆదుకోండి మహాప్రభో అని ప్రభుత్వ పెద్దలను కోరుతున్నా వేలం కేంద్రాల సందర్శన, ఆర్భాటపు ప్రకటనలు మినహా ఒరిగిందేమీ లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొనుగోళ్ల ప్రారంభమై దాదాపు 70 రోజులు గడుస్తున్నా ధరలు పుంజుకోకపోవడంతో రైతు పరిస్థితి మరింతగా దిగజారింది.

గతేడాది కేజీ గరిష్ట ధర రూ.366...

రీజియన్ పరిధిలో గతేడాది కేజీ పొగాకు గరిష్ట ధర రూ.366 పలకగా, ఈ ఏడాది వేలం మొదలై 65 రోజులు దాటుతున్నా ఇంత వరకు గరిష్ట ధర రూ.280కు మించలేదు. గత నాలుగేళ్లలో గరిష్ట ధరలను పరిశీలిస్తే 2020–21లో రూ.184, 2021–22లో రూ.199, 2022–23లో రూ.289, 2023–24లో రూ.366 పలకగా, ఈ ఏడాది.. అంటే 2024–25లో రూ.281 పలికింది. అది కూడా రెండుమూడు బేళ్లు తప్ప కొనుగోలు చేసిన బేళ్ల సరాసరి చూసుకుంటే ఈ ఏడాది రూ.255.35కు మాత్రమే పరిమితమైంది.



ధర లేక వేలం కేంద్రం నుంచి పొగాకు బేళ్లను వెనక్కి తీసుకెళ్తున్న రైతులు (ఫైల్)

భారీగా పెరిగిన పెట్టుబడులు...

గత నాలుగేళ్లలో పొలాల కౌలు, పెట్టుబడి, బ్యారన్ అద్దెలతో పోల్చుకుంటే ఈ సంవత్సరం దాదాపు 80 శాతానికిపైగా ఖర్చులు పెరిగాయి. గత నాలుగేళ్లలో ఒక్కో బ్యారన్ రైతు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు లాభాలు గడించారు. ఈ ఏడాది పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ప్రస్తుతం పలుకుతున్న ధరలు చూసి రైతుల నోట మాట కూడా రావడం లేదు. ఒక్కో బ్యారన్‌కు సుమారు రూ.3 లక్షలకుపైగా నష్టాలు వచ్చే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి ఖర్చులు పెరగడం, పొలాలు, బ్యారన్‌ల కౌలు, కూలీల ధరలు భారీగా పెరగడంతో సాగు వ్యయంలో సగానికి సగం కూడా రావడం లేదని వాపోతున్నారు. పొగాకు బేళ్లకు పలుకుతున్న ధరలే సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. కేజీ పొగాకు గరిష్ఠంగా రూ.320 పలికితే రైతులు కొద్దోగొప్పో లాభాలతో బయటపడేవారు. కానీ, ప్రస్తుతం పలుకుతున్న ధరలుగరిష్ఠంగా రూ.260కు మించి పలకడం లేదు. ఎక్కడో ఒకటో రెండో బేళ్లకు మాత్రం రూ.280 పలుకుతోంది.

అమ్ముకోలేక, నిల్వ ఉంచలేక...

పెట్టిన పెట్టుబడి రాక, నష్టాలు భరించలేక, ప్రభుత్వం చేష్టలుడిగి చోద్యం చూస్తుండటంతో చేసేది లేక నాగులుప్పలపాడు, వెల్లంపల్లి, కొండపి ప్రాంతాల రైతులు వేలం కోసం తీసుకొచ్చిన బేళ్లను ఇంటికి తీసుకెళ్లలేక నడిరోడ్లపై పడేసి ఆవేదనతో దహనం చేస్తున్నారు. ప్రభుత్వం ఏమాత్రం చేయూతనివ్వకపోవడంతో జగన్ సర్కార్ కాలంలో పొగాకు రైతులకు అందించిన ధరలను గుర్తుచేసుకుంటున్నారు. ఇప్పుడొస్తున్న ధరలతో పోల్చుకుంటూ కుమిలిపోతున్నారు.

మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించాలి



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పొగాకు ధరలు తగ్గిపోవడంతో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించారు. దీంతో వ్యాపారుల్లో పోటీ నెలకొని పొగాకు ధరలు పెంచి కొనుగోలు చేశారు. పొగాకు రైతులు లాభాలు పొందారు. గత నాలుగు సంవత్సరాలుగా వారికి ఎనలేని మేలు జరిగింది. రైతు కుటుంబాల్లో పిల్లల చదువులు, వివాహాలు, ఇతర ఖర్చులకు ఎటువంటి సమస్యా లేకుండా గడిచింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులను గాలికొదిలేసింది. దీంతో పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పొగాకు రైతులను ఆదుకోవాలి.

– వెన్నా రామిరెడ్డి, పొగాకు రైతు, గొట్లగట్టు

మార్క్‌ఫెడ్ ద్వారా రైతులకు అండగా నిలిచిన వైఎస్సార్ సీపీ సర్కార్...

నాలుగేళ్ల కిందట బయ్యర్ల నుంచి సరైన ప్రోత్సాహం లభించక గిట్టుబాటు ధరలు రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్న దశలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి అండగా నిలిచింది. రైతుల దగ్గర నుంచి పొగాకు కొనుగోలు చేసి గిట్టుబాటు ధరలు కల్పించడంతో కష్టాల నుంచి గట్టెక్కారు. మార్కెట్లో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పోటీతత్వం పెరగడంతో రైతులు లాభాల బాటపట్టారు. ఆనాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలిచిన విధానాన్ని ఇప్పుడు రైతులు గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుతం రైతులు తీవ్రంగా నష్టాలపాలవుతున్నా వారి గురించి ఆలోచించే మంత్రులే లేరని వాపోతున్నారు.

నాడు గుల్లాకుకూ మంచి రేటు...

గత నాలుగేళ్లలో రైతులు అనుమతికి మించి పొగాకు సాగుచేసినా.. బోర్డు అధికారులు బయ్యర్లతో కొనుగోలు చేయించారు. గతేడాది (2023–24) 88.69 మిలియన్ కేజీలు కొనుగోలు చేసేందుకు బోర్డు అనుమతిచ్చింది. అయితే, రైతుల నుంచి ఏకంగా 154.41 మిలియన్ కేజీలు కొనుగోలు చేసింది. రైతుల వద్ద చివరిగా మిగిలిన పండాకు, మాడు, పచ్చ, గుల్ల వంటి ఆకును సైతం మంచి ధరకు కొనుగోలు చేశారు.

నాగులుప్పలపాడు ఎస్సైపై వేటు

- వీరయ్య చౌదరి హత్య కేసులో అనుమానితులను బెదిరించి భారీగా వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు
- అంకమ్మతల్లి కొలుపుల వివాదంలోనూ ఎస్సైపై విమర్శలు
- విచారణకు ఆదేశించిన ఎస్పీ.. దీర్ఘకాలిక సెలవులో ఎస్సై



నాగులుప్పలపాడు ఎస్సై శ్రీకాంత్ (ఫైల్)

ఒంగోలు టౌన్: అవినీతి ఆరోపణల నేపథ్యంలో నాగులుప్పలపాడు ఎస్సై శ్రీకాంత్‌పై వేటుపడింది. శనివారం ఉదయం ఆయనను జిల్లా పోలీసు కార్యాలయానికి పిలిపించిన ఎస్పీ ఏఆర్ దామోదర్.. చివాట్లు పెట్టినట్లు తెలిసింది. ఎస్పీ చాంబర్ నుంచి బయటకు వచ్చిన కొద్దిసేపటికే ఆయన దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయినట్లు సమాచారం. పోలీసు డిపార్ట్‌మెంటుకు సంబంధించిన సిమ్ కార్డును కూడా కార్యాలయంలో అప్పగించినట్లు తెలిసింది. నాగులుప్పలపాడు ఎస్సైగా శ్రీకాంత్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆయనపై విపరీతమైన అవినీతి ఆరోపణలు వచ్చాయి. నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకుడు ముప్పవరపు వీరయ్య చౌదరి గత నెల 22వ తేదీ హత్యకు గురయిన కేసు విచారణను ఎస్సై శ్రీకాంత్ తనకు అనుకూలంగా మార్చుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో నాగులుప్పలపాడు మండలానికి చెందిన కొందరు అనుమానితులను పోలీసుస్టేషన్‌కు పిలిపించి వేధించడమే కాకుండా వారి నుంచి భారీ మొత్తంలో వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. మరికొందరికి ఫోన్లు చేసి బెదిరించి కిందిస్థాయి సిబ్బందిని వారి వద్దకు పంపించి డబ్బు వసూలు చేసినట్లు ఆరోపణలొచ్చాయి.

అంకమ్మతల్లి కొలుపుల్లోనూ భారీగా ముడుపులు...

ఇటీవల నాగులుప్పలపాడులో అంకమ్మతల్లి కొలుపుల నిర్వహణ విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం నెలకొన్న సమయంలోనూ ఎస్సై శ్రీకాంత్ తీరుపై విమర్శలు వచ్చాయి. వైజాగ్ నుంచి వచ్చిన టీడీపీకి చెందిన ఒక వ్యాపారి వద్ద నుంచి భారీగా ముడుపులు తీసుకుని అతడికి అనుకూలంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వినిపించాయి. దీంతో స్థానికులు నలుగురు ఆత్మహత్యకు యత్నించడం జిల్లాలో సంచలనం సృష్టించింది. ఆ తర్వాత ఆత్మహత్యకు యత్నించిన వారితో పాటు స్థానికులు 16 మందిపై కేసులు బనాయించి ఒక మైనర్ బాలికను పోలీసుస్టేషన్‌కు పిలిపించి అసభ్యంగా దూషించినట్లు విమర్శలు వచ్చాయి. గత ఫిబ్రవరి నెలలో చేలల్లో మట్టి తోలుకుంటున్న రైతులను కూడా వదిలిపెట్టలేదని ప్రచారం జరిగింది. డబ్బులిచ్చిన తర్వాతే మట్టి తోలుకోవాలని రైతులను ఇబ్బందులకు గురిచేయడంతో వారంతా నాగులుప్పలపాడు పోలీసు స్టేషన్ వద్ద ధర్నాకు దిగారు. ఇక, అధికార పార్టీ నాయకుల అండదండలతో రెచ్చిపోయిన ఎస్సై శ్రీకాంత్.. పేకాటరాయుళ్లు, కోడిపందేల నిర్వాహకులు, బెల్టుషాపుల వ్యాపారస్తుల నుంచి కూడా భారీగా డబ్బులు పిండుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎస్సై శ్రీకాంత్ వ్యవహారాన్ని ఎస్పీ ఏఆర్ దామోదర్ సీరియస్‌గా తీసుకుని విచారణకు ఆదేశించినట్లు తెలిసింది.

పొగాకు రైతుల పరిస్థితి దారుణం

- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంటు పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి



పొదిలి పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లను పరిశీలిస్తున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి

పొదిలి రూరల్: కూటమి ప్రభుత్వంలో పొగాకు రైతుల పరిస్థితి దారుణంగా ఉందని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంటు పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. పొదిలి పొగాకు వేలం కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. పొగాకు కొనుగోళ్లను పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రాంతానికి వెళ్లినా రైతులు పండించిన పంటలు కొనే దిక్కులేదన్నారు. రాష్ట్రంలో పొగాకు పండించే రైతుల పరిస్థితి చూస్తే మరీ దారుణంగా ఉందన్నారు. టుబాకో బోర్డు వారు 18 మిలియన్ల పొగాకుకు అనుమతిచ్చి, అందులో కేవలం 20 శాతం.. అంటే 3 వేల మిలియన్లు మాత్రమే కొనుగోలు చేశారన్నారు.

అది కూడా బీ గ్రేడ్ అనే దానికి గతంలో రూ.28 వేల నుంచి రూ.38 వేల మార్కెట్ వరకు జరిగితే.. ఇప్పుడు రూ.18 వేల నుంచి రూ.23 వేల వరకు ఇస్తున్నారన్నారు. రైతులు సెకండ్ గ్రేడ్, థర్డ్ గ్రేడ్ పొగాకుకు ధర దక్కదని తగలబెడుతున్నారన్నారు. గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడంతో పొగాకు రైతులు లాభాలు పొందారని చెప్పారు. ఎకరాకు రూ.3 లక్షల లాభం వచ్చిందని, ఇప్పుడు ఎకరాకు లక్ష నుంచి లక్షన్నర నష్టం వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని బత్తుల తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పొగాకును గ్రేడ్‌లుగా విభజించి రైతులను దివాళా తీయిస్తున్నారన్నారు. రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించేంత వరకు వారికి అండగా నిలిచి వైఎస్సార్ సీపీ పోరాడుతుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కూడా అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఈ నెల 28వ తేదీ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి రానున్న సందర్భంగా హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కేవీ రమణారెడ్డి, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, గొలమారి చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి అవసరాలకు మాత్రమే సాగర్ నీరు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: నాగార్జునసాగర్ కుడికాలువ ద్వారా విడుదల చేసిన నీటిని కేవలం తాగునీటి అవసరాలకే వినియోగించుకునేలా చూడాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఆ దిశగా పర్యవేక్షించేందుకు రెవెన్యూ, పోలీస్, ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్, మున్సిపల్, జలవనరుల శాఖల అధికారులతో ప్రత్యేక కమిటీని ఆమె ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు నుంచి ఈ నెల 23వ తేదీ 4 టీఎంసీల నీటిని అధికారులు కుడికాలువకు విడుదల చేశారు. వీటిని పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలు వినియోగించుకోవాల్సి ఉన్న నేపథ్యంలో.. వ్యవసాయ అవసరాలకు కాకుండా కేవలం తాగునీటి కోసమే వినియోగించుకునేలా పర్యవేక్షించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మోటార్ల ద్వారా వ్యవసాయ అవసరాలకు ఎవరూ దొంగిలించకుండా సాగర్ కాలువ గట్లపై గస్తీ నిర్వహించాలని సూచించారు. అవసరమైన తాగునీటి ట్యాంకులు, ఇతర వనరులకు సాగర్ నీటిని మళ్లించి జిల్లాలోని ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

బెంగళూరుకు ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు

ఒంగోలు టౌన్: ప్రయాణికుల సౌకర్యార్థం ఒంగోలు ఆర్టీసీ డిపో నుంచి బెంగళూరుకు సూపర్ లగ్జరీ సర్వీసును ఆదివారం ప్రారంభించనున్నట్లు డిపో మేనేజర్ డి.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు ఒంగోలు నుంచి బయలుదేరి కందుకూరు, పామూరు, ఉదయగిరి, బద్వేలు, కడప, మదనపల్లి మీదుగా బెంగళూరు చేరుకుంటుందని తెలిపారు. ప్రతిరోజూ రాత్రి 7.30 గంటలకు ఒంగోలులో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.15 గంటలకు బెంగళూరు చేరుకుంటుందని చెప్పారు. అలాగే, బెంగళూరులో రాత్రి 7.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.45 గంటలకు ఒంగోలు చేరుకుంటుందని వివరించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనంతపురం–అమరావతి హైవే రక్తమోడుతోంది. వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు టెర్రర్ పుట్టిస్తున్నాయి. అమరావతి నుంచి విజయవాడ వరకు ఉన్న జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఏ ముహూర్తాన ఆ రోడ్డు ప్రారంభించారోగానీ రోజూ యాక్సిడెంట్లే. ప్రయాణికుల ప్రాణాలు క్షణాల్లో గాల్లో కలుస్తున్నాయి. శుక్రవారం తాటిచర్లమోటు వద్ద జరిగిన ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. ప్రమాదాలకు డ్రైవర్ల నిర్లక్ష్యంతో పాటు అధికారుల అనాలోచిత నిర్ణయాలు కూడా కారణమవుతున్నాయి.



- రక్తమోడుతున్న జాతీయ రహదారి
- ప్రమాదాల జోన్‌గా అమరావతి–అనంతపురం హైవే
- మార్కాపురం డివిజన్‌లో 15 బ్లాక్ స్పాట్స్ గుర్తింపు

హైవే..డెత్‌వే!

మార్కాపురం/కంభం:

అనంతపురం–అమరావతి జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. నేషనల్ హైవే కావడంతో గ్రామాల వద్ద క్రాస్ రోడ్లు, మూలమలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో తరుచూ యాక్సిడెంట్లు జరిగి పలువురు అర్ధంతరంగా తనువు చాలిస్తున్నారు. గిద్దలూరు నుంచి త్రిపురాంతకం వరకు ఉన్న హైవేలో 2022 నుంచి 2024 వరకు మొత్తం 350 రోడ్డు ప్రమాదాలు జరుగగా అందులో 343 మంది చనిపోయారు. 676 మంది క్షతగాత్రులయ్యారు. తాజాగా ఈ ఏడాది ఫిబ్రవరి 16న మార్కాపురం మండలం నికరంపల్లి వద్ద మిర్చి కూలీలతో ప్రయాణిస్తున్న టాటాఏస్ అదుపుతప్పి రోడ్డుపై పడటంతో ఇద్దరు మృతి చెందారు. మార్చి 1న తిప్పాయిపాలెం వద్ద కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏప్రిల్ 5న తిప్పాయిపాలెం వద్ద రోడ్డుదాటుతున్న 10 ఏళ్ల బాలుడు శివకాశిని కారు ఢీకొనడంతో మృతి చెందాడు. ఈ నెల 21న చింతగుంట్ల– కుంట మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వృద్ధులు మరణించారు. మితిమీరిన వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడపటం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుకోవడం, ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించడం వంటివి ప్రమాదాలకు ప్రధాన కారణాలవుతున్నాయి. ముఖ్యంగా గిద్దలూరు నుంచి త్రిపురాంతకం వరకు ఉన్న నేషనల్ హైవేపై తరుచూ రోడ్డు యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. ఎక్కువగా గిద్దలూరు–దిగువమెట్ట, గిద్దలూరు–బేస్తవారపేట, మార్కాపురం–కంభం, మార్కాపురం– దేవరాజుగట్టు, దేవరాజుగట్టు–కుంట, కుంట–త్రిపురాంతకం మధ్య ఉన్న నేషనల్ హైవేపై సర్వీసు రోడ్లు సరిగా లేకపోవడంతో టూ వీలర్స్‌పై వచ్చేవారు రోడ్డెక్కే సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు.

రోడ్డు ప్రమాదాల లెక్కలివే..

మార్కాపురం డివిజన్‌లో విజయవాడ–అనంతపురం హైవేపై రోడ్డు ప్రమాదాల వివరాలు

సంవత్సరం	రోడ్డు ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2022	130	129	282
2023	117	96	218
2024	98	106	176

ఈ ఏడాది ఇప్పటి వరకు మార్కాపురం ప్రాంతంలో ఐదు రోడ్డు ప్రమాదాలు జరుగగా 12 మంది మరణించారు. 10 మంది క్షతగాత్రులయ్యారు.


కంభం హైవేపై జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనాలు (ఫైల్)


జంగంగుంట్ల సమీపంలో హైవే పక్కన బోల్తా పడిన కారు (ఫైల్)


శుక్రవారం తాటిచెర్లమోటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం

15 బ్లాక్ స్పాట్స్ గుర్తింపు

మార్కాపురం డివిజన్‌లో మొత్తం 15 బ్లాక్ స్పాట్స్‌ను అధికారులు గుర్తించారు. ఇందులో మార్కాపురం మండలం కుంట, పెద్దారవీడు మండలం కుంట, గొబ్బూరు, త్రిపురాంతకం, దరిమడుగు నేషనల్ హైవేపై వై.జంక్షన్ తిప్పాయపాలెం, జంగంగుంట్ల, బేస్తవారపేట క్రాస్ రోడ్స్, గిద్దలూరు, తర్లుపాడు–తాడివారిపల్లి హైవే ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్స్ ఉన్నట్లు గుర్తించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ఇటు పోలీసులు.. అటు రవాణాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారి బైకులను ఆపి వారికి జరిమానా విధించడంతో పాటు కౌన్సిలింగ్ ఇస్తున్నారు. పోలీసులు తరుచూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. మూలమలుపుల వద్ద బ్లింకింగ్ లైట్లు, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేశారు. కళాశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. స్పీడ్ గన్‌తో నేషనల్ హైవేపై రవాణాశాఖాధికారులు తనిఖీలు నిర్వహిస్తూ ఓవర్ స్పీడుతో వెళ్లే వారికి జరిమానా విధిస్తున్నారు.

డేంజర్ జోన్‌గా ఎన్‌హెచ్ 544–డి

అనంతపురం–అమరావతి (ఎన్‌హెచ్ 544–డి) హైవే ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. జాతీయ రహదారి నిర్మాణం అనంతరం రోడ్డు ప్రమాదాలు మరీ ఎక్కువగా జరుగుతున్నాయి. హైవే నిర్మించిన అధికారులు అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు, యూటర్న్, మూలమలుపుల వద్ద లైటింగ్ లేక పోవడం, సూచికలు ఏర్పాటు చేయక పోవడం, హైవే మార్జిన్లు ప్రమాదకరంగా ఉండటంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్నిసార్లు మనం చేసే తప్పిదాలు, పొరపాట్లు మన కుటుంబాలతో పాటు ఎదుటి వారి కుటుంబాల్లో విషాదం మిగులుతోంది. పోలీసులు నిత్యం వాహనాలు తనిఖీలు చేసి జరిమానాలు విధిస్తున్నా, రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నా వాహనదారుల్లో ఏ మాత్రం చలనం రావడం లేదు. నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

మితిమీరిన వేగమే ప్రమాదాలకు కారణం

మితిమీరిన వేగం, మద్యం మత్తులో వాహనాలు నడపటంతో అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. తెల్లవారు జామున 3 నుంచి 4 గంటల సమయంలో నిద్రమత్తులో ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలున్నాయి. బేస్తవారిపేట మండలం పూసలపాడు, మోక్షగుండం, చింతలపాలెం, కంభం హైవేలో యూటర్న్, వై.జంక్షన్, జంగంగుంట్ల, మార్కాపురం మండలం తిప్పాయిపాలెం, చింతకుంట్ల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి.

నిబంధనలు పాటించాలి



వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి. మితిమీరిన వేగం, మద్యం తాగి వాహనాలు నడపకూడదు. రాత్రి వేళ దూరప్రయాణం చేసే వాళ్లు ఎక్కడైనా వాహనాన్ని ఆపుకొని కొద్దిసేపు నిద్రపోయి ఆ తర్వాతే డ్రైవింగ్ చెయ్యాలి. ద్విచక్ర వాహనదారుడు కచ్చితంగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి. తల్లిదండ్రులు చిన్న పిల్లలకు వాహనాలు ఇచ్చి పంపకూడదు. ప్రమాదాల నివారణకు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం.

– కె.మల్లికార్జున, సీఐ, కంభం


అమరావతి-అనంతపురం హైవే


కుంట వద్ద ప్రమాదకర మూడు రోడ్ల కూడలి


కంభం జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న యూటర్న్

ముగిసిన పోస్టుమార్టం

- మృతదేహాలు బంధువులకు అప్పగింత
- స్వగ్రామానికి ప్రైవేట్ వాహనంలో తరలింపు

కొమరోలు: మండలంలోని తాటిచెర్లమోటు సమీపంలో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా ఇద్దరు చిన్నారులు తీవ్ర గాయాలతో బయటపడిన విషయం తెలిసిందే. బాపట్ల జిల్లా స్టూవర్టుపురం గ్రామానికి చెందిన గజ్జల అంకాలు (40), గజ్జల భవాని (25), గజ్జల నరసింహులు (20), గజ్జల జనార్దన్ (30), బొచ్చు సన్ని (30), కర్రెద్దుల దివాకర్ (30) మృతి చెందగా మృతదేహాలను పోస్టుమార్టం కోసం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదం విషయం తెలుసుకున్న మృతుల బంధువులు స్టూవర్టుపురం నుంచి గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకున్నారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం ఉదయం వైద్యులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం ఆరు మృతదేహాలను బంధువులకు అప్పగించారు. ఓ ప్రైవేట్ అంబులెన్స్‌లో మృతదేహాలను స్టూవర్టుపురానికి తరలించారు.


మృతదేహాలను తరలిస్తున్న బంధువులు

చిన్నారులకు మెరుగైన వైద్యం

ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. మృతి చెందిన వారితో పాటు జీతన్, శిరీషలు ఆ కారులోనే ప్రయాణిస్తున్నారు. గాయపడిన వీరికి గిద్దలూరు వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించి అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు వైద్యశాలకు తరలించినట్లు స్థానిక ఎస్సై నాగరాజు తెలిపారు.

మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణం

- ప్రమాద సమయంలో 120 కిలోమీటర్ల వేగంతో వెళ్తున్న కారు
- రాంగ్ రూటులో లారీని బలంగా ఢీకొట్టిన కారు
- వివరాలు వెల్లడించిన మార్కాపురం డీఎస్పీ నాగరాజు


ప్రమాదంపై పోలీసులతో చర్చిస్తున్న డీఎస్పీ నాగరాజు

కొమరోలు: తాటిచెర్లమోటు కారు ప్రమాదానికి మితిమీరిన వేగమే కారణమని మార్కాపురం డీఎస్పీ నాగరాజు వెల్లడించారు. ఆర్‌టీఓ అల్లం మాధవరావుతో కలిసి శనివారం ఆయన ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గురైన కారును క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం డీఎస్పీ నాగరాజు మాట్లాడుతూ ప్రమాదం జరిగిన సమయంలో కారు వేగం 120 కిలోమీటర్లు ఉందని స్పష్టం చేశారు. కారు వేగంగా వెళ్లి లారీని ఢీకొనడం వల్లే ప్రమాద తీవ్రత పెరిగిందని చెప్పారు. వాహనాలను నిర్లక్ష్యంగా, వేగంగా ఎవరూ నడపొద్దని సూచించారు. నేషనల్ హైవే ప్రాజెక్టు మేనేజర్ మల్లికార్జునరెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ ఎం.నరసింహులు, గిద్దలూరు, కంభం సీఐలు రామకోటయ్య, మల్లికార్జున, ఎస్సైలు రవీంద్రరెడ్డి, నాగరాజు, కోటేశ్వరరావు, సుదర్శన్ పాల్గొన్నారు.

నేడు హనుమాన్ శోభాయాత్ర

ఒంగోలు మెట్రో: విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక సంతపేట వీరాంజనేయ స్వామి దేవస్థానం నుంచి నగరంలోని నెల్లూరు బస్టాండ్, ట్రంకు రోడ్డు, కర్నూల్ రోడ్డు ఫ్లయి ఓవర్, మంగమూరు రోడ్డు మీదగా సీవీఎన్ రీడింగ్ రూమ్, శివాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు భజరంగ్ దళ్ కన్వీనర్ మతంపల్లి దుర్గేష్ తెలిపారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కరపత్రాలు ఆవిష్కరించారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

చిన్నారులను రక్షించిన వ్యక్తికి రివార్డు


బాలవెంకటరెడ్డిని అభినందిస్తున్న డీఎస్పీ నాగరాజు

కొమరోలు: తాటిచెర్లమోటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు ప్రాణాలతో బయటపడిన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడికి చేరుకున్న తాటిచెర్ల గ్రామానికి చెందిన పాశం బాలవెంకటరెడ్డి చిన్నారుల ఆర్తనాదాలు విని కారు వెనుక వైపు డోరు అద్దాలు పగులగొట్టాడు. చిన్నారులు జీతన్, శిరీషలను బయటకు తీసి వెంటనే గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించేందుకు కృషి చేశాడు. ఈ విషయాన్ని మార్కాపురం డీఎస్పీ నాగరాజు దృష్టికి ఎస్సై నాగరాజు తీసుకెళ్లారు. బాలవెంకటరెడ్డికి డీఎస్పీ నగదు రివార్డును ప్రమాద స్థలంలో శనివారం అందించి అభినందించారు. బాలవెంకటరెడ్డి సాయం వెలకట్టలేనిదని కొనియాడారు. స్థానికులు కూడా ఆయన్ను అభినందించారు.

సమస్యలపై స్పష్టత ఇవ్వాలి

ఒంగోలు టౌన్: ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలపై కమిషన్ స్పష్టత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకటరావు, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. జీవో నంబర్–50 ప్రకారం 2022 మార్చి 23లో ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు సర్వీస్ పాయింట్లు, స్టేషన్ పాయింట్ల విషయంలో స్పష్టత ఇవ్వక పోవడంతో గందరగోళం నెలకొందన్నారు.

ముగ్గురికి గాయాలు

పామూరు: ఓ గేదె ఉన్నట్టుండి రోడ్డుపైకి రావడంతో రెండు కార్లు బోల్తా కొట్టగా మరో వాహనం పాక్షికంగా దెబ్బతింది. ప్రమాదంలో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని లక్ష్మీనరసాపురం వద్ద 167బి జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగింది. క్షతగాత్రులను 108లో పామూరు సీహెచ్‌సీకి తరలించగా డాక్టర్ ఎం.ప్రవీణ చికిత్స అందించారు.